జంగ్ తెలంగాణ 2023

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో రెండు బెల్ట్ షాపులు, అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటలో రెండు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం రావడంతో బుధవారం దాడులు నిర్వహించి రూ.29 వేల 757 విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.

అడుగడుగునా నిఘా.. విస్తృత తనిఖీలు

కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: అడుగడుగునా నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టే దిశగా కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో నలుగురిని ఎంపిక చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు బృందాలను ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ఆకస్మికంగా ప్రధాన రహదారుల వెంట తనిఖీలు చేపట్టనున్నారు. అదే విధంగా బహదూర్ పల్లి, ఐడీపీఎల్ ప్రాంతాల్లో నిరంతరం ఎన్నికలు ముగిసే వరకు ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి అక్కడే తనిఖీలు చేసి వాహనాలను పంపే ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి విషయంపై ఉల్లంఘనలు చేసే వారిపై టీమ్‌ను నియమించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది జీహెచ్ఎంసీ డివిజన్లతో పాటు కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగింపుతో పాటు ప్రచార పర్వంలో అభ్యర్థులు చేస్తున్న ఖర్చు విషయాలపై దృష్టి సారించనున్నారు. రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి ఒక్కో టీమ్‌లో ముగ్గురిని నియమించారు.



- సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలన
- ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వచ్చే పోస్టులపై చర్యలు
- సంబంధిత అడ్మిన్‌కు నోటీసులు.. తర్వాత క్రిమినల్ కేసులు నమోదు
- కలెక్టర్ ఆధ్వర్యంలో ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

నిఘా..!



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువత అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాల్లో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రతి జిల్లాలో మీడియా మానిటరింగ్ కమిటీ

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాల్లో నమోదు చేస్తున్న ప్రచారం కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ–జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కిరణ్‌కుమార్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు సభ్యులుగా ఉంటారు. వీరు ప్రతిరోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు..

ఏదైనా సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిషన్‌పై పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్షిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని అంటున్నారు.

క్లుప్తంగా

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



రాయదుర్గం: దసరా పండగను పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిం చారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించాలని ఆలయ పాలక మండలి నిర్ణయించింది. 23వ తేదీ రాత్రి 7.30 గంటలకు శమీ పూజను నిర్వహిస్తారు. కాగా 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారం సమయంలో సమర్పించిన చీరలను 24వ తేదీన విక్రయించాలని తలపెట్టారు. కాగా ఆలయంలో ప్రత్యేకంగా పిల్లల కోసం సరస్వతీ మాత పూజ నిర్వహించాలని నిర్ణయించారు. 24వ తేదీన షిర్డీసాయిబాబాకు అభిషేకం ఉంటుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

పరామర్శ



అమ్రేష్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అమ్రేష్‌గౌడ్ కాలికి గాయమైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా ఉన్నారు.

కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా సునీల్‌యాదవ్

మూసాపేట: మూసాపేటకు చెందిన సునీ ల్ యాదవ్‌ను బుధవారం కూకట్‌పల్లి ని యోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమించారు. ఎన్నికల వరకు ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు తెలంగాణ ఇన్‌చార్జ్ సయ్యద్ ఖలీద్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పదవితో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

కొండాపూర్ ఆస్పత్రిలో మార్చురీ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వినతి

రాయదుర్గం: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి ప్రాంతం ఐటీ రంగానికి కేంద్రంగా మారడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి చాలా మంది ఇక్కడ నివాసముంటున్నారని పేర్కొన్నారు. వారు ఉద్యోగాల నిమిత్తం విదేశాలలో పనిచేయడానికి వెళ్లగా వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసముంటున్నారని వివరించారు. ఈ క్రమంలో ఎవరైనా మృతి చెందితే వారు వచ్చే వరకు అంత్యక్రియల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని అందుకోసం గాంధీ, ఉస్మానియా, ఇతర ఆస్పత్రుల మార్చురీలో పెట్టాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేస్తే కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరువాసులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

15 నుంచి డీటీఎఫ్ మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15,16,17 తేదీల్లో 'ఐదవ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలు' నిర్వహిస్తున్నట్లు మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. ఈ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లా, భగీరథకాలనీ, అన్నపూర్ణ గార్డెన్స్‌లో జరుగుతాయన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభల పోస్టర్‌ను డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధానకార్యదర్శి టి.లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక బాధ్యులు రాఘవాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యం చేసి సమాజంపట్ల ఎలా అవగాహన పెంచాలి అన్న అంశాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థ ప్రమాదంలో ఉన్నప్పుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సభలకు భగత్‌సింగ్ అల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిష్టప్ప, డాక్టర్ రామకృష్ణ, వినోదర్ కుమార్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య దినోత్సవం

మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని కెనరీ ద స్కూల్లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మన జీవితంలో మానసిక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు నిర్వహించిన ఉదయ అసెంబ్లీలో విభిన్న భావోద్వేగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా పీఎస్‌సీవో వర్క్‌షాప్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టినా ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించే మార్గాలు ఆవశ్యకత గురించి విద్యార్థులు తెలియజేశారు.

ఐఐఎంసీ కళాశాలలో జీ-20 నమూనా సమావేశం



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఐఐఎంసీ కళాశాలలో రెండు రోజుల పాటు జి 20 నమూనా సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 10, 11 తేదీలలో కళాశాల సమావేశ మందిరంలో జరిగిన జి 20 నమూనా సమావేశంలో దేశం ఐక్యంగా ఉండాలని, సమాజానికి ఐకమత్యమే బలమని, అది లేకపోతే ఆ సమాజం దుర్బలమౌతుందన్నారు. 8 ఎజెండా పాయింట్లపై చర్చించారు. మొదటి రోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, స్టార్టప్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్, కరెన్సీలు, యుద్ధం, టెర్రరిజం అంశాలతో పాటు రెండో రోజు సుస్థిరత, సుస్థిర వాతావరణ మార్పు, మహిళా సాధికారత, రాజకీయ అస్థిరత తదితరన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

37 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.37 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ లక్ష్మీ సాయి మిడోస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ ఆగస్టు 30న తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.37 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ వచ్చారు. చివరగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15న క్యాట్ షో



పోటీల్లో పాల్గొనే పిల్లిని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: ది ఫెల్లిన్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 15న 'క్యాట్ షో' నిర్వహిస్తున్నట్లు మలేషియాకు చెందిన పోటీల న్యాయనిర్ణేత సేన్ అబ్దుల్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌సీఐ హైదరాబాద్ ప్రతినిధి అబ్దుల్ మనన్, సక్వేబ్ పాథా, డాక్టర్ మురళిలతో కలిసి వివరాలు వెల్లడించారు.. అత్తాపూర్ లోని పిల్లర్ నెంబర్ 290, హెచ్.ఎఫ్ కన్వెన్షన్‌లో ఈ క్యాట్ షో జరుగుతుందన్నారు. సుమారు 250కి పైగా పిల్లులు పాల్గొంటాయని అందులో 13 బ్రీడ్స్ ఉన్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా మలేషియా, సింగపూర్, ఉక్రేయిన్, రష్యా, థాయిలాండ్, యూఎస్ నుంచి కూడా పిల్లుల పెంపకందారులు హాజరుకానున్నట్లు తెలిపారు. పిల్లి హెడ్ స్ట్రక్చర్, బాడీ స్ట్రక్చర్, కంటి కలర్, వాటి హెల్త్ కండీషన్, బిహేవియర్ చూసి పాయింట్లు ఇస్తారన్నారు. పెట్ లవర్స్ తప్పకుండా ఈ షోను వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల ఏర్పాట్ల పరిశీలన



బతుకమ్మ జరిగే ప్రాంతాన్ని అధికారులతో పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని బజరంగ్ దేవాలయం ప్రాంగణంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాలు సందర్భంగా ఏర్పాట్లను బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను తీసుకువచ్చే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రత, లైటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఆలయ చైర్మన్ తుల సీరావు, బతుకమ్మ సంబరాలు కోఆర్డినేటర్ కె. నాగరాజు, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే..



రాయదుర్గం: గోపన్‌పల్లి శివారులోని వివాంటీస్ అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023లో అండర్–11, అండర్–13, అండర్–15, విమెన్స్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, మెన్ డబుల్స్ పోటీలను నిర్వహించారు.అండర్–11 విభాగంలో మొదటి స్థానంలో దర్శిల్, రెండవ స్థానంలో కె.ఆర్నవ్, మూడవ స్థానంలో అథరవ్ వేదుల నిలిచారు. అదే విధంగా అండర్–13లో నవికాఅగర్వాల్, సమంత్, మోక్షజ్ఞ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–15లో సుజయ్ గడ్డం, రామ్‌ప్రహన్, విక్రాంత్ బాల, విమెన్స్ సింగిల్స్ విభాగంలో ప్రియాంక, అలేఖ్య, త్రిషాసిన్హా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా మిక్స్‌డ్ డబుల్స్ విజేతలలో మనోహర్ గడ్డం–త్రిషాసిన్హా, సుబ్బు–అలేఖ్య, రుషిదేష్‌పాండే–ప్రియ, మెన్స్ డబుల్స్ విజేతలుగా మనోహర్‌గడ్డం–సౌరబ్‌జైన్, రుషిదేష్‌పాండే–పియూష్, రామ్‌శంకర్–డేవిడ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలుగా నిలిచిన వారికి అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ట్రోఫీలను బహూకరించి అభినందించారు.

'మనూ'లో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మనూలో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కేంద్రాలైన ఔరంగాబాద్, బీదర్, భోపాల్, నూహ్, సంభాల్, శ్రీనగర్‌లలో, పాలిటెక్నిక్ కేంద్రాలైన బెంగళూరు, కడప, కటక్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మనూ 2023–24లో హాజరైన, అర్హత సాధించిన అభ్యర్థులు, ఇంతకుముందు నోటిఫై చేయబడిన తాత్కాలిక జాబితాలలో పేరు కనిపించని అభ్యర్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చని ఆమె వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత క్యాంపస్‌లలో వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ అక్టోబర్ 16న జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు 19,20 తేదీలలో ఫీజు చెల్లించ వచ్చన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పదవీ విరమణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ప్రొ.వీసీ ఆర్ఎస్ సర్రాజు పదవీవిరమణ అభినందన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు హెచ్‌సీయూలో అధ్యాపకుడిగానే కాకుండా వివిధ బాధ్యతలను నిర్వహించారు. మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో డీన్ ఆచార్య కృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణ మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక్కరికీ సహజమని, వారి సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆచార్యులు గజేంద్రపాఠక్, మురళీ మనోహర్ ,దార్ల వెంకటేశ్వరరావు, ఫజులుల్లా, పిల్లలమర్రి రాములు, పమ్మి పవన్‌కుమార్, భీమయ్య, హైమావతి, బాణాల భుజంగరెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఘనీభవించిన పదార్థం భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్న 3రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సు చైర్ ప్రొఫెసర్ అశోక్ ఛటర్జీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా ఉన్న నిపుణులను ఒకచోట చేర్చి వినూత్న ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి.. ఆధునిక కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్‌లో తాజా పరిణామాలను పంచుకోవడానికి ఈ సదస్సు తోడ్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ దత్తాత్రి జెయిస్ నగేష్ మాట్లాడుతూ... ఈ రంగంలో యువత భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలన్నారు. కన్వీనర్ డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... 170 పరిశోధనా పత్రాలలో 112 ఎంపిక చేశామన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

కూకట్‌పల్లి: సీఐటీయూ కూకట్‌పల్లి మండల కమిటీ, లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు హనుమాన్ నగర్ బస్తీలో బుధవారం వైద్య, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పి. ధర్మారావు, కూకట్‌పల్లి మండల కమిటీ నాయకులు ఎం. శంకర్‌లు పాల్గొని మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్డు లేని వారు వెంటనే భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డును పొందాలన్నారు. దీనితో ప్రభుత్వ సంక్షేమ బోర్డు నుంచి మెటర్నిటీ, మ్యారేజ్ బెనిఫిట్‌లతో పాటు అనారోగ్యంతో ఉన్న వారు రూ.30వేలను లబ్ధిదారునికి అందజేస్తారని, అదే విధంగా ప్రమాదంలో మరణించిన, సహజ మరణం పొందిన కార్మికుడు 6 లక్షల రూపాయల లబ్ధి పొందుతారని తెలిపారు. దీంతో పాటు హెల్త్ చెకప్‌ను నిర్వహిస్తారని అన్నారు. అందులో భాగంగా కార్మికులందరికీ హెల్త్ చెకప్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నరసమ్మ, బాబురావు, పీఎల్ శర్మ, పార్వతమ్మ, లీలావతి, మనమ్మ, గోపమ్మ, సూర్యనారాయణ, ల్యాబ్ అసిస్టెంట్ హుస్సేన్, రాజు పాల్గొన్నారు.

జైభారత్‌నగర్ సమస్యలను పరిష్కరిస్తా

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



సమస్యలను స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జైభారత్‌నగర్‌లో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కాలనీవాసులతో కలిసి హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యలే పరిష్కరమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. కాలనీవాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు కుమారస్వామి, పూర్ణచందర్‌రావు, సాంబశివరావు, శ్రీనివాస్, ప్రభాకర్, మహేష్, నర్సయ్య, సారంగపాణి, కృష్ణంరాజు, సీతాపతి రాజు, రఘువీర్, హరిబాబు, శివరాం ప్రసాద్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.